అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




6

**ఎకరం పంట కూడా ఎండిపోకూడదు**

నీటిపారుదల అధికారులకు మంత్రి


WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

J V NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -73 మంగళవారం18 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# పేదల ఆరోగ్యం మా బాధ్యత



## డాక్టర్ మర్రిచెన్నారెడ్డి టిమ్స్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

**విద్యావైద్యరంగాలకు ప్రాధాన్యతిస్తున్నాం**

**ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్ కోసమే రూ.5,226 కోట్లు ఖర్చుచేశాం**

**వైద్యారోగ్య శాఖకు రూ.21,800 వెచ్చించాం**

**టెంకాయలు కొట్టి వదిలేసినోళ్లు టిమ్స్ కట్టామని గొప్పలా**

**ప్రభుత్వ ఆస్పత్రుల్లో అదనపు**

**సమయం పనిచేసే డాక్టర్లకు ప్రోత్సాహకాలివ్వండి**



**హైదరాబాద్ ఆగస్టు 17(జర్నలిస్ట్ వార్త):**
పేదల వైద్యానికి ప్రాధాన్యమిస్తున్నామనీ, వారి ఆరోగ్యం తమ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్యావైద్య రంగాల కు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సనత్‌నగర్ లో నూతనంగా నిర్మించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆస్పత్రిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిం చారు. **మిగతా 2లో...**

# బీజేపీ జాతీయ నూతన కార్యవర్గం..

## నూతన కార్యవర్గం ప్రకటించిన నితిన్ నబీన్



**13 మందికి జాతీయ ఉపాధ్యక్ష పదవులు**

**జాతీయ ప్రధాన కార్యదర్శులుగా 8 మంది..**

**కార్యదర్శులుగా 16 మంది పేర్లు ఖరారు**

**కొత్త టీమ్కు ప్రధాని మోడీ అభినందనలు**



**న్యూఢిల్లీ:ఆగస్టు 17(జర్నలిస్ట్ వార్త):** బీజేపీ అధిష్ఠానం పార్టీ నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులుగా పురందేశ్వరి, వసుంధరా రాజె, రామ్ మాధవ్ సహా 13 మంది పేర్లను ప్రకటించారు. **మిగతా 2లో...**

# నాగబాబుకు కేబినెట్ హోదాతో పదవి..

**నాగబాబుకు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి**

**కేబినెట్ హోదాతో నియామకం చేపట్టిన ప్రభుత్వం**

**రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం సాధించడమే లక్ష్యం**

**సోదరుడి నియామకంపై హర్షం వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం**



**అమరావతి ఆగస్టు 17(జర్నలిస్ట్ వార్త):**
జనసేన సీనియర్ నేత, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో, నాగబాబు సోదరుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి పక్షాల నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా నాగబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. **మిగతా 2లో...**

# ప్రజల్లో 22ఎ గందరగోళం

**డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా**

**సీలింగ్ చట్టం ఎత్తేశాక మళ్లీ ఎందుకొచ్చింది**

**సిఎం రేవంత్ ఇల్లు జాబితాలో వచ్చాకనే చురుకు**

**పాలనపై పట్టు లేదనడానికి ఇదే పెద్ద నిదర్శనం**

**మీడియా సమావేశంలో ప్రభుత్వ తీరుపై హరీష్ ఆగ్రహం**

**హైదరాబాద్,ఆగస్టు 17(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోందని.. బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ఎవరి భూమి 22ఎలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని మాజీ హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. **మిగతా 2లో...**



# కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ కొనసాగుతుంది

**గత ప్రభుత్వం పక్కాగా అమలు చేయలేదు**

**అందుకే కోర్టుల్లో కేసులు వచ్చాయి**

**దీనిపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నాం**

**ధర్నాలు చేసే వారు పథకల తప్పిదాలపై మాట్లాడాలి**

**మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి**

**హైదరాబాద్, ఆగస్టు 17(జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్ గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళ్యాణ లక్ష్మి పథకంపై వివరించారు. కళ్యాణ్ లక్ష్మీ పథకం పై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను **మిగతా 2లో...**



## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం

**ఐఎస్ఐ అండతో పనిచేస్తున్న షాజాద్ భట్టి ఉగ్ర నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశామన్న అమిత్ షా**

**స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దాడుల కుట్రను భగ్నం చేశామన్న అమిత్ షా**

**14 రాష్ట్రాల్లో విస్తృతంగా ఆపరేషన్లు.. 200 మందికి పైగా అరెస్ట్**



2లో.



# మండలిలో డీఎస్సీ రగడ..

**బొత్సకు అచ్చెన్నాయుడు కౌంటర్**

**డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్న అచ్చెన్నాయుడు**

**విద్యాశాఖ మంత్రిగా బొత్స విఫలమయ్యారంటూ అచ్చెన్న విమర్శలు**

**అచ్చెన్న వ్యాఖ్యలపై దుమారం, క్షమాపణ చెప్పాలని విపక్షం పట్టు**

**గందరగోళం మధ్య శాసనమండలి రెండు సార్లు వాయిదా**

**అమరావతిఆగస్టు 17(జర్నలిస్ట్ వార్త):**
గత ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులకు 'మెగా డీఎస్సీ' ఇస్తామని ఆశలు రేపి, చివరికి ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా మోసం చేసిన వైసీపీకి ఇప్పుడు డీఎస్సీ నియామకాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన**మిగతా 2లో...**

# తెలంగాణలో సర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల.

**ముసాయిదాలో 2.64 కోట్ల మంది పేర్లు**

**92 లక్షల మందికి నోటీసులు ఇవ్వనున్నట్లు వెల్లడి**

**నోటీసులకు సెప్టెంబర్ 16 వరకు గడువు**


**ఏఎస్‌డీడీ జాబితాలో 73 లక్షల మంది**



**హైదరాబాద్ ఆగస్టు 17(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. సర్‌కు ముందు రాష్ట్రంలో 3,38,26,448 మంది ఓటర్లు**2లో...**

# ఏపీపై ఎల్ నినో పంజా..

## తీవ్ర వర్షాభావంపై అసెంబ్లీలో చంద్రబాబు వివరణ



**అమరావతి ఆగస్టు 17(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని, దీని కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాసనసభలో సోమవారం జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే చాలా తక్కువగా నమోదవుతోందని, ఈ క్లిష్ట పరిస్థితిపై ప్రజలకు అసెంబ్లీ వేదికగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. ఈ ఏడాది వర్షపాతం అంచనాలను, వాస్తవ పరిస్థితులను ముఖ్యమంత్రి గణాంకాలతో సహా వివరించారు.

## నాగబాబుకు కేబినెట్ హోదాతో పదవి..

**మొదటి పేజీ తరువాయి**

ఈ నియామకంపై పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. నాగబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ, "వికసిత్ ఆంధ్రప్రదేశ్2047 సాధనలో భాగంగా రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం పచ్చదనం సాధించాలనే లక్ష్యాన్ని ఆయన సమర్థమైన నాయకత్వంలో ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. అటవీ విస్తీర్ణం పెంపు, పునర్వనీకరణ, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలు నాగబాబు నాయకత్వంలో మరింత వేగవంతంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.
భవిష్యత్తు తరాలకు పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను అందించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కీలక బాధ్యతలో నాగబాబు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వంలో జనసేన నేతకు కేబినెట్ హోదాతో పదవి లభించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

## తెలంగాణలో సర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల.

**మొదటి పేజీ తరువాయి** ఉన్నారని తెలిపారు. గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన 2,64,87,214 మంది పేర్లతో ముసాయిదా జాబితా రూపొందించినట్లు చెప్పారు.మొత్తం ఓటర్లలో 78.03 శాతం మంది పేర్లు ముసాయిదా జాబితాలో ఉన్నాయని సుదర్శన్ రెడ్డి తెలిపారు. మరోవైపు 73 లక్షల మంది ఓటర్లు ఏఎస్‌డీడీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్) జాబితాలో ఉన్నట్లు చెప్పారు. అన్‌మ్యాప్డ్ జాబితాలో ఉన్న 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు.నోటీసులు అందుకున్నవారు తమ వివరాలపై వివరణ ఇచ్చేందుకు సెప్టెంబర్ 16 వరకు గడువు ఉంటుందని తెలిపారు. ఈ నోటీసులను బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) పోస్టు ద్వారా పంపించనున్నట్లు చెప్పారు. తమ పేరు జాబితాలో లేకపోయినా అర్హత ఉన్నవారు ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

## మండలిలో డీఎస్సీ రగడ..

**మొదటి పేజీ తరువాయి**

బొత్స సత్యనారాయణ, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుని ఇప్పుడు మండలిలో డీఎస్సీపై నీతులు చెప్పడం సిగ్గుచేటని ఆయన ఘాటుగా విమర్శించారు.సోమవారం ప్రారంభమైన ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాల తొలిరోజే శాసనమండలి 'మెగా డీఎస్సీ-2025' అంశంతో దద్దరిల్లింది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అయితే, మండలి చైర్మన్ కె. మోషేను రాజు వాయిదా తీర్మానాన్ని తిరస్కరించి, ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ఈ అంశంపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.చైర్మన్ నిర్ణయంతో ఏకీభవించని వైసీపీ సభ్యులు, సభా కార్యకలాపాలను అడ్డుకుంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. డీఎస్సీ పేరుతో మూడు లక్షల మంది నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని, క్రీడల కోటాలో తమకు నచ్చిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై సభలో చర్చ జరగాలని పట్టుబట్టారు.
బొత్స ఆరోపణలపై అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందించారు. "గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని మీరు ఇప్పుడు మాట్లాడుతున్నారా? అధికారంలో ఉన్నప్పుడు చేతకాక, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక మండలిలో ప్రశ్నలు వేయడం రాజకీయ ద్వంద్వ నీతి కాదా?" అని బొత్సను నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు సకాలంలో ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అయితే, దీన్ని అడ్డుకునేందుకు వైసీపీ ఏకంగా 300 కోర్టు కేసులు వేసిందని అచ్చెన్నాయుడు ఆరోపించారు.ఈ క్రమంలో బొత్స సత్యనారాయణను ఉద్దేశించి అచ్చెన్నాయుడు చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. దీంతో వైసీపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. గందరగోళం నడుమ చైర్మన్ సభను వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత, అచ్చెన్నాయుడు తన అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బొత్స డిమాండ్ చేశారు. దీనికి మంత్రి స్పందిస్తూ, తాను వాడిన పదాలు అన్‌పార్లమెంటరీ కావని, ఒకవేళ చైర్మన్ రూలింగ్ ఇస్తే క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అయినప్పటికీ వైసీపీ సభ్యులు నిరసన కొనసాగించడంతో, చైర్మన్ సభను రెండోసారి వాయిదా వేశారు.

## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం

పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్' అనే ఉగ్రవాద ముఠాను పూర్తిగా నిర్మూలించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దేశంలో విధ్వంసక దాడులు చేసేందుకు పన్నిన భారీ కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయని, ఈ క్రమంలో 14 రాష్ట్రాల్లో 200 మందికి పైగా నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.ఈ మేరకు అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరాలను వెల్లడించారు. భద్రతా బలగాలు సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను ఛిన్నాభిన్నం చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆగస్టు 12వ తేదీన దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లలో మొత్తం 253 మందిని అదుపులోకి తీసుకోగా, 200 మందికి పైగా నిందితులను అధికారికంగా అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 62 మంది, హర్యానాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ముద్రలు కలిగిన గ్రెనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు సామాగ్రితో పాటు గూఢచర్యం కోసం వినియోగించే రహస్య కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.షాజాద్ భట్టి నెట్‌వర్క్, ప్రధానంగా గ్రెనేడ్, ఐఈడీలు, పెట్రోల్ బాంబు దాడులతో పాటు లక్షిత హత్యలకు కుట్ర పన్నుతున్నట్లు అధికారులు వివరించారు. పోలీసు స్టేషన్లు, రక్షణ సంస్థలు, మతపరమైన ప్రదేశాలపై నిఘా ఉంచేందుకు ఈ ముఠా స్థానికులకు భారీగా నగదు చెల్లించిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

## బీజేపీ జాతీయ నూతన కార్యవర్గం..

**మొదటి పేజీ తరువాయి**

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్మృతి ఇరానీని ప్రకటించారు. పార్టీ జాయింట్ కోఆర్డినేటర్‌గా విష్ణువర్ధన్‌రెడ్డిని నియమించారు. కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్, రాదీజ మోర్చా నూతన అధ్యక్షుడిగా అమర్‌పాల్ మౌర్య పేర్లను ప్రకటించింది పార్టీ అధిష్ఠానం. అలాగే, సంస్థాగత జనరల్ సెక్రటరీగా దీ.రా.సంతోష్, సంస్థాగత జాయింట్ జనరల్ సెక్రటరీగా శివప్రకాష్ పేర్లను ఖరారు చేసింది బీజేపీ అధినాయకత్వం. కాగా, బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు చోటు దక్కలేదు. పైగా ఉపాధ్యక్షురాలిగా ఉన్న డీకే అరుణను తప్పించారు.పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నేతృత్వంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. అనుభవజ్ఞులైన నాయకులు, యువ నాయకుల సమ్మేళనంతో జాతీయ కార్యవర్గంలో ప్రాంతయ ప్రాతినిధ్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులలో ఒకరిగా మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కీలక సంస్థాగత పాత్రలోకి తిరిగి రావడం ఒక పెద్ద పరిణామం. తెరపైకి వచ్చిన మరో కీలక పేరు రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే. 13 మంది జాతీయ ఉపాధ్యక్షులలో ఆరుగురు మహిళలు ఉండటం, పార్టీ కీలక పదవులలో మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రయత్నాన్ని సూచిస్తుంది. ఈ నియామకాలు దక్షిణ, తూర్పు రాష్ట్రాల వైపు మొగ్గు చూపుతున్న ధోరణిని సూచిస్తున్నాయి. కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాల నాయకులకు కీలక పదవులు లభించాయి.

## ప్రజల్లో 22ఎ గందరగోళం

**మొదటి పేజీ తరువాయి** కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట్ కింద 22ఎలో పెట్టడం ఏ రకమైన న్యాయం..ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ఎలో పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ ఎ÷-లాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలని హరీశ్ రావు ప్రశ్నించారు. తమ ప్రాపర్టీ 22ంలో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ఎ లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఔక్షఅ వచ్చిన భూములకు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇప్పుడు అవే భూములను తీసుకొచ్చి 22ఎ లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారు.

# దమ్ముంటే సభకు రండి

**మొదటి పేజీ తరువాయి**

సంస్కరణలకు శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, మండలానికి ఓ జూనియర్ కాలేజీ, జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామని తెలిపారు. 2019-24 మధ్య ఐదేళ్లలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయని పాలకులు, విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు 14 డీఎస్సీలు జరిగితే, వాటిలో 11 డీఎస్సీలను టీడీపీ, ఎన్డీయే ప్రభుత్వాల హయాంలోనే నిర్వహించి, అవినీతికి ఆస్కారం లేకుండా నియామకాలు చేపట్టామని వివరించారు.

**148 రోజుల్లోనే పారదర్శకంగా నియామకాలు**

గత పాలకులు ఐదేళ్లలో చేయలేని పనిని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకంతో చేసి చూపించామని చంద్రబాబు అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలను కేవలం 148 రోజుల్లోనే పారదర్శకంగా భర్తీ చేశామని వివరించారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ల నుంచి హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియ వరకు అన్నీ కట్టుదిట్టంగా చేపట్టామన్నారు.
13 సబ్జెక్టులకు 42 వేల ప్రశ్నలను ఎంపిక చేసి, 154 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశామని తెలిపారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేశామని, నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉన్నాయని, ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఫిర్యాదుల పరిష్కారానికి జోనల్, రాష్ట్రస్థాయి కమిటీలతో పాటు అప్పీలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు.

**వైసీపీవి ఫేక్ ఆందోళనలు, కుట్రలు**

డీఎస్సీపై వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోందని సీఎం ధ్వజమెత్తారు. "గొడ్డలి పార్టీ నేతలు ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్‌జీ వ్యక్తులతో ఫేక్ ధర్నాలు చేయిస్తున్నారు. ప్రభుత్వంలో పనిచేసి రిటైరైన ఓ ఐఏఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. వైసీపీ ఆరోపణలను సహించలేకే డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన టీచర్లే స్వయంగా రోడ్లపైకి వస్తున్నారని, మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో భారీగా ఆందోళనలు చేశారని గుర్తుచేశారు. "పిల్లలకు పాఠాలు చెబుతాం.. మా ప్రతిభను కించపరిస్తే గుణపాఠం కూడా చెబుతాం" అని వారు నినదించిన విషయాన్ని చంద్రబాబు సభ దృష్టికి తెచ్చారు.

**అసెంబ్లీకి రాకుండా పబ్జీలా?**

తమ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అని, కుట్రలు చేసే పార్టీలకు కాదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి. అడ్డంగా దొరికిపోతామనే భయంతో వారు సభకు రావడం లేదు. సిగ్గులేని ఆ పార్టీ సభ్యులు అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారు. రెండున్నరేళ్లుగా సభకు రాకుండానే జీతాలు, ప్రివిలేజెస్ తీసుకుంటున్నారు. నా జీవితంలో ఇలాంటి పార్టీని చూడలేదు" అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనకు ప్రజల పట్ల పూర్తి బాధ్యత ఉందని, రాష్ట్రంలో ఎలాంటి కుట్రలు పనిచేయవని, ఉపాధ్యాయ నియామకాలు అత్యంత జవాబుదారీతనంతో జరిగాయని సీఎం పునరుద్ఘాటించారు.

### సభలోనైనా, బయటైనా.. డిబేట్ కు నేను రెడీ: జగన్ కు నారా లోకేశ్ సవాల్

"గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి సవాల్ విసురుతున్నా. డీఎస్సీ-2025పై చర్చకు నేను సిద్ధం. సభ లోపలైనా, బయటైనా సరే.. టైమ్, డేట్ మీరే ఫిక్స్ చేయండి" అంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వైసీపీ అధినేత జగన్ కు బహిరంగ సవాల్ విసిరారు. మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై శాసనసభలో సుదీర్ఘ ప్రకటన చేసిన ఆయన, ప్రతిపక్షంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాను బెయిల్‌పై లేనని, తనపై సీబీఐ, ఈడీ కేసులు లేవని, విదేశాలకు వెళ్లేందుకు తనకేమీ కోర్టు అనుమతులు అవసరంలేదని ఎద్దేవా చేశారు. చర్చకు వస్తే వాస్తవాలు తెలుతాయని అన్నారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన తొలి సంతకం మెగా డీఎస్సీపైనే అని లోకేశ్ గుర్తుచేశారు. ఈ నియామక ప్రక్రియను కేవలం 148 రోజుల్లో పూర్తి చేసి 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. 3.36 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, టీసీఎస్ అయాన్ వంటి సురక్షిత ప్లాట్‌ఫామ్ ద్వారా అత్యంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని వివరించారు. ఈ డీఎస్సీని అడ్డుకోవడానికే వైసీపీ నాయకులు 141 కేసులు వేశారని, సీఎం తొలి సంతకం అమలు కాకుండా అడ్డుకోవాలని కుట్ర పన్నారని ఆరోపించారు.

**ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి**

మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను లోకేశ్ తీవ్రంగా ఖండించారు. ప్రశ్నపత్రం లీక్ అయిందన్నది అవాస్తవమని, 42 వేల ప్రశ్నలతో కూడిన క్వశ్చన్ బ్యాంక్ నుంచి ర్యాండమ్‌గా ప్రశ్నలు వస్తాయని, లీకేజీకి ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి ప్రశ్నపత్రం రూపకల్పనలో ప్రమేయం లేదని, అతను శాఖాపరమైన అనుమతులు తీసుకోనందునే అనర్హుడయ్యాడని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో ఒకే సామాజికవర్గానికి మేలు చేశారన్న ఆరోపణలను తోసిపుచ్చారు. మొత్తం 372 మందిలో 46 మంది ఓసీ, 185 మంది బీసీ, 112 మంది ఎస్సీ, 29 మంది ఎస్టీ అభ్యర్థులు ఉన్నారని గణాంకాలతో సహా వివరించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే 65 క్రీడాంశాలను పరిగణనలోకి తీసుకున్నామని, శాప్ ఆధ్వర్యంలో పారదర్శకంగా వెరిఫికేషన్ జరిపామని పేర్కొన్నారు.

**విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యం**

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని, ఫలితంగా 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లిపోయారని లోకేశ్ విమర్శించారు. టీడీపీ హయాంలోనే 1.80 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేశామని గుర్తుచేశారు. యువగళం పాదయాత్రలో కర్నూలు జిల్లాలో వలస కూలీల పిల్లల దుస్థితిని చూసి, మెగా డీఎస్సీ ద్వారా ఆ జిల్లాకు అధిక సంఖ్యలో టీచర్లను కేటాయించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగానికి అనుగుణంగా వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లను పక్కాగా అమలు చేశామని, ఈ విధానాన్ని ప్రశ్నించడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు.

**యువతకు భరోసా**

ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసిందని యువతకు భరోసా ఇచ్చారు. అభ్యర్థుల సందేహాల నివృత్తికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, వేలాది ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. "ఈ ఏడాది కూడా 3,000 పోస్టులతో డీఎస్సీ నిర్వహిస్తాం. ప్రతి ఏటా క్రమం తప్పకుండా టీచర్ పోస్టులను భర్తీ చేసి విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తాం. యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి" అని లోకేశ్ పిలుపునిచ్చారు.
డీఎస్సీ అంటే 'డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్' అని చెప్పే దౌర్భాగ్యపు పార్టీ రాష్ట్రంలో ఉందని ఆయన ఎద్దేవా చేశారు. పారదర్శక నియామకాలకు మద్దతుగా నిలిచిన ఉపాధ్యాయ సంఘాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరో మూడు డీఎస్సీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేశ్ పునరుద్ఘాటించారు.

# పేదల ఆరోగ్యం మా బాధ్యత

**మొదటి పేజీ తరువాయి**

అనంతరం అక్కడ జరిగిన సభలో ఆరోగ్యదీపిక పాలిక్లినిక్‌లను ప్రారంభించారు. సురక్షితమైన ఆహారం, నాణ్యమైన మందులు అందించడమే లక్ష్యంగా టీసేఫ్ వ్యవస్థను ప్రారంభించారు. పలువురు డాక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూడతెలంగాణ బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయనీ, ఆ భాషలను నేర్చుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. వైద్యం అత్యంత ఖరీదు కావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించాలనే లక్ష్యంతోనే సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్‌లను, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రులను కడుతున్నా మని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ కోసం రూ.2700 కోట్లు, సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు, మొత్తంగా ఆ రెండింటికీ రూ.5,226 కోట్లను ఖర్చుచేశామని వివరించారు. రెండేండ్లలో వైద్యారోగ్య శాఖ కోసం రూ.21,800 కోట్లు వెచ్చించామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనాలను కట్టించాలనే సోయి గత ప్రభుత్వానికి ఎందుకు లేకుండా పోయిందని ప్రశ్నించారు.టిమ్స్ ఆస్పత్రులకు, వరంగల్ దవాఖానాకు కేవలం టెంకాయలుకొట్టి వదిలేశారనీ, పదేండ్లలో వాటిని ఎందుకు కట్టలేదని అడిగారు. ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్‌లను, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రులను 2027 డిసెంబర్ తొమ్మిదో తేదీకల్లా పూర్తిచేసి ఒక్కో ఆస్పత్రికి ఒక్కో డైరెక్టర్‌ను నియమించి స్పెషాలిటీ వైద్యసేవలను అందజేస్తామనీ, వాటిని నిమ్స్ తరహాలో తీర్చిదిద్దుతామని హామీనిచ్చారు. అవన్నీ పూర్తయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరో పదివేల బెడ్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆస్పత్రికొచ్చే రోగుల సహాయకులు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. డాక్టర్ ఎమ్‌సీఆర్ టిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ పీజీ విద్య, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రుల్లో అదనంగా సమయం వెచ్చించి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలందించే, సర్జరీలు చేసే వైద్యులకు ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులను వేదిక నుంచే ఆదేశించారు. తాము సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభిస్తామని ప్రకటించగానే కొందరు పగటివేషగాళ్లలా తిరిగి పోయారనీ, ఇది తామే కట్టామని కేటీఆర్ చెప్పి పోయారని విమర్శించారు. వెనక ఉన్న ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రికి వెళ్లి మానసిక రోగిని టిమ్స్ కట్టిన తమను గుర్తుపట్టట్లేదా? అని కేటీఆర్ అడిగితేడ"ఈడికొచ్చినప్పుడు చార్మినార్ నేనే గట్టిన. హైదరాబాద్‌ను నేనే నిర్మించిన అనుకునేటోన్ని. ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేటోన్ని. ఈడ డాక్టర్లు మంచిగ చూస్తరు. రానురాను పిచ్చి తగ్గిపోతది లే అన్నడంట" అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు సమయం ఉందిగానీ ప్రభుత్వ ఆస్పత్రులను కట్టించి ప్రారంభించేందుకు పదేండ్లలో సమయమే దొరలేదా? అని ప్రశ్నించారు. అబద్దాలు మానుకుని ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవాలనీ, నియోజకవర్గానికి పది నుంచి 20 కోట్ల రూపాయలు ఖర్చుచేసి ప్రజలకు సేవచేస్తే చేసిన పాపాలు కొంతైనా తగ్గుతాయని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. కేసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదనీ, ఇలా ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. వాళ్లు అబద్ధాలు చెప్పడం మాననంత కాలం ప్రజలకు నిజాలు చెబుతూనే ఉంటానన్నారు. **బీఆర్ఎస్ నేతల ప్రచారం పచ్చి అబద్ధం : (డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూడతాము కట్టిన వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభిస్తోందని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమని విమర్శించారు. సనత్‌నగర్ టిమ్స్ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చుచేసింది రూ.70 కోట్లు మాత్రమేననీ, ఆ డబ్బులతో అది ఎలా పూర్తవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతం కోసం తమ ప్రభుత్వం రెండున్నరేండ్లలో రూ.9 వేల దాకా ఖర్చుపెట్టిందనీ, ఆరు ప్రధాన ఆస్పత్రుల నిర్మాణాలపైనే రూ.3,800 ఖర్చుచేశామని గణాంకాలతో సహా వివరించారు. ఆరోగ్య శ్రీ పథకం కింద పేదలను రూ.10 లక్షల సహాయాన్ని అందిస్తున్నామనీ, ప్రతి నెలా ఆరోగ్య శ్రీ పథకం కిందనే రూ.100 కోట్లు విడుదల చేస్తున్నామని చెప్పారు.90 శాతం వైద్యసేవలు జిల్లాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లోనే అందేలా కృషి చేస్తున్నామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సనత్‌నగర్ టిమ్స్‌లో గుండె సంబంధ, అవయమార్పిడి, కిడ్నీడఎల్బీనగర్ టిమ్స్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ, పీడీయాట్రిక్‌డఅల్వాల్ టిమ్స్‌లో న్యూరాలజీ, జెనిటిక్‌కు సంబంధించిన స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తామని మరోమారు చెప్పారు. టిమ్స్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునికమైన రేడియాలజీ విభాగం గురించి వివరించారు. రాబోయే పదేండ్లలో తలసేమియా రహిత తెలంగాణగా మార్చే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. మహిళా సంక్షేమం, వైద్యం, విద్య, సంక్షేమం ప్రభుత్వానికి నాలుగు పిల్లర్ల లాంటివనీ, వాటిపైనే దృష్టి పెట్టి తమ ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు.

# కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ కొనసాగుతుంది

**మొదటి పేజీ తరువాయి**

ఒక పిటిషన్ హైకోర్టులో వేసిందన్నారు. అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలకు ఇవ్వడం జరిగింది. దీనిపై డివిజనల్ బెంచ్ కు అప్పీల్ కై వెళుతున్నాము. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం అని మంత్రి తెలిపారు. ఈ పథంలోని లొసుగులు ఏదైనా ఉంటే అది గత ప్రభుత్వం 2014లో చేసిన పొరపాటు వల్ల తలెత్తినది. అప్పుడు సరైన రీతులో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం త్వరలో గత ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తామన్నారు. గత ప్రభుత్వం పథకం లోప భూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయిందన్నారు. కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రజలకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లు పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ పథకాలను గత ప్రభుత్వం ప్రారంభించింది. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుంది. రాజకీయ పిటిషన్లు పై ఈ పథకం ఎందుకు కొనసాగిస్తున్నారు అని స్టే ఇచ్చింది.. పథకాన్ని ఎత్తివేయలేదు..ఇది గత ప్రభుత్వ పథకం దీనిని ఎత్తివేయాలని మేము ఆలోచన చేయలేదు. గతంలో నిధులు కేటాయింపులకు సంబంధించిన ఇబ్బంది ఉన్న మేము వచ్చిన తర్వాత గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేసాం. వాళ్లు చేసిన అప్పులు.. దానిని తొలగించడానికి నిధుల సకాలంలో విడుదల చేయడానికి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు.. పేద ల పిల్లల వివాహాలకు సామాజికంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం బాసటగా ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. 12 తారీకు స్టే విధించింది.. వచ్చే నెల 9 వరకు అవకాశం ఉన్నప్పటికీ అప్పటి వరకు వెయిట్ చేయకుండా కోర్టులో స్టే తొలగించడానికి ముందుకు పోయాం.. రోడ్ల మీద నిరసనలు చేస్తున్న నాయకులకు చెప్తున్న మీరు చేసిన జీవోల వల్లే పథకానికి ఈ పరిస్థితి వచ్చింది. అయినా మేము కొనసాగిస్తున్నాం అన్నారు. బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, పీసీసీ,మంత్రులు ,ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు , ఎంపీలు, ప్రజా ప్రతినిధులు ,బలహీన వర్గాల నాయకులు ,కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొన్ననే ట్యాంక్ బండ్ పక్కన సామాజిక ఉద్యమ నాయకుడు మహాత్మా జ్యోతిబాఫూలే సావిత్రి బాయ్ ఫూలే విగ్రహావిష్కరణ చేసుకున్నామని మంత్రి వివరించారు.

# ఆర్ఎంపీలు హద్దు మీరకండి!

## డెంగ్యూ నిర్ధారణ.. ఇంజక్షన్లు చేయొద్దు

## అనుమానిత కేసులను ప్రభుత్వ ఆస్పత్రులకు పంపాలి

## డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్



**తల్లాడ/ ఆగస్టు 17 (జర్నలిస్ట్ వార్త):**గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందించే ఆర్ఎంపీలు తమ పరిధిని దాటి వైద్యం చేయొద్దని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్ స్పష్టం చేశారు. డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులను ఆర్ఎంపీలు స్వయంగా నిర్ధారించరాదని, రోగులకు స్టెరాయిడ్లు, యాంటీబయాటిక్స్ ఇంజక్షన్లు ఇవ్వడం చేయొద్దని సూచించారు. అనుమానిత కేసులను వెంటనే ప్రభుత్వ వైద్య కేంద్రాలకు రెఫర్ చేయాలని తెలిపారు.మండల పరిధిలోని మిట్టపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సోమవారం డాక్టర్ ప్రదీప్ సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడి గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జ్వరాలపై నిరంతర నిఘా ఉంచాలని, అనుమానిత కేసులను గుర్తించి సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**దోమలపై యుద్ధం:**ప్రతి మంగళవారం, శుక్రవారం 'డ్రై డే/ఫ్రైడే' కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని డాక్టర్ ప్రదీప్ సూచించారు. ఇళ్ల పరిసరాల్లో, గ్రామాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల వృద్ధికి అడ్డుకట్ట వేయాలని తెలిపారు. డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు.

**మందుల కొరత రాకుండా చూడాలి:**ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ ప్రదీప్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రత్యూష, పల్లె దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

# హాస్టల్‌లో విద్యార్థికి విద్యుత్ షాక్

## 11 కేవీ వైర్‌కు ఇనుప గజం తగలడంతో ఘటన

## ప్రస్తుతం ప్రాణాపాయం లేదు.. 24 గంటల పరిశీలనలో



**నరసన్నపేట/ఆగస్టు 17 (జర్నలిస్ట్ వార్త):**

నరసన్నపేటలోని ప్రిజం కళాశాల హాస్టల్‌లో 18 ఏళ్ల విద్యార్థి విద్యుత్ షాక్‌కు గురైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. హాస్టల్‌లో ఉంటున్న లండ లికిందర్ బట్టలు తీసే క్రమంలో ఇనుప గజాన్ని ఉపయోగించగా.. సమీపంలోని 11 కేవీ విద్యుత్ వైర్‌కు అది తగలడంతో విద్యుత్ షాక్‌కు గురైనట్లు సమాచారం. లికిందర్ స్వగ్రామం చిన్నకోడూరు అని తెలిసింది.

**తోటి విద్యార్థుల అప్రమత్తత:** విద్యుత్ షాక్‌కు గురైన లికిందర్‌ను గమనించిన తోటి విద్యార్థులు వెంటనే స్పందించి సమీపంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. ప్రస్తుతం ప్రాణాపాయం లేదని, అయితే విద్యుత్ షాక్ ప్రభావం కారణంగా 24 గంటలపాటు ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని సూచించినట్లు సమాచారం. పరిస్థితిని బట్టి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించాలని వైద్యులు సూచించినట్లు తెలిసింది.

**హాస్టళ్ల భద్రతపై ప్రశ్నలు:** ఈ ఘటనతో నరసన్నపేటలోని ప్రైవేట్ హాస్టళ్ల భద్రతా ప్రమాణాలపై చర్చ మొదలైంది. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హాస్టళ్లు పట్టణంలో అధికంగా ఉన్నాయనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు హాస్టళ్లపై తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**లోహ వస్తువులతో జాగ్రత్త:**విద్యుత్ వైర్లకు సమీపంలో ఇనుప కర్రలు, పైపులు, గజాలు వంటి లోహ వస్తువులను ఉపయోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. ముఖ్యంగా హాస్టళ్లలో బట్టలు ఆరేసే ప్రదేశాలు విద్యుత్ లైన్లకు దూరంగా ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# లచ్చన్న... బడుగు బలహీన వర్గాల బలగం!

## ఒక్క కులానికే కాదు.. అందరివాడు

## నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**నరసన్నపేట/ ఆగస్టు 17 (జర్నలిస్ట్ వార్త):**



బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న అని, ఆయన ఒక్క కులానికో, వర్గానికో, ప్రాంతానికో పరిమితమైన నాయకుడు కాదని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. జాతీయస్థాయిలో అందరి నాయకుడిగా గుర్తింపు పొందిన మహోన్నత వ్యక్తి లచ్చన్న అని కొనియాడారు.నరసన్నపేట మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం శ్రీ శయన కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు టీవీ చంద్రమోహన్‌దేవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమణమూర్తి మాట్లాడుతూ.. రాజకీయ రంగంలో ఎన్నో పదవులు చేపట్టి, ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల తరపున గళమెత్తిన లచ్చన్న, అనంతరం సొంతంగా పార్టీని స్థాపించి అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచి వారి సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లిన ఘనత లచ్చన్నకే దక్కుతుందన్నారు. ప్రజల కోసం చేసిన పోరాటాలతో వారి హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు.

**ఘనంగా నివాళులు:**లచ్చన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యక్రమంలో పలువురు పిలుపునిచ్చారు. అనంతరం సంఘం ప్రతినిధులు, టీడీపీ నాయకులు లచ్చన్న సేవలను స్మరించుకున్నారు.కార్యక్రమంలో వంజల రామరాజు, దంత శ్రీనివాసరావు, బతకల సంతోషి, దండుపాటి రాధాకృష్ణ, పోతల శ్రీనివాసరావు, తట్ట గణేష్, దంత త్రినాధరావు, బొంతల సింహాచలం, దండి భాస్కర్‌రావు, పూతి రవికుమార్, తోట మురళీకృష్ణ, పిరియా గణేష్, తోట యుగంధర్, కోల సింహాచలం, డొంకాన మణికంఠ, గొద్దు చిట్టిబాబు, శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు రామారావు, అడపా చంద్రశేఖర్, బోయిన సతీష్, పాగోటి అప్పలనాయుడు, పీశ కృష్ణ, బలగ ప్రహర్షకుమార్, రావాడ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుడికి అపన్న హస్తం.



**బయ్యారం,ఆగస్టు 17.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండల కేంద్రంలోని ముస్తఫా నగర్ కాలనికి చెందిన పెద్ద మీరా సెంట్రింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు క్రిందపడి కాలు ఫ్యాక్చర్ అవ్వడంతో స్పందించిన ముస్తఫా నగర్ వాసులు గొప్ప మనసు చాటుకొని బాధితుడికి 65.500 వేల రూపాయలు నగదు,ఆ కుటుంబానికి నిత్యవసర సరుకులు అందించారు.ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్థిక సాయం అందేలా చేసిన షేక్ బాషా,షేక్ మదార్ ప్రిన్సిపాల్,షేక్ నాగుల్ మీరా, వార్డు సభ్యులు జానీకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముస్తఫా నగర్ యువత,మిత్రులు,తదితరులు పాల్గొన్నారు.

# దివిటిపల్లిలో ఎంఆర్‌పీఎస్‌ఎంఎస్‌పీ నూతన కమిటీ ఎన్నిక



**వర్ధన్నపేట/ఆగస్టు 17 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని దివిటిపల్లి గ్రామంలో ఎంఆర్‌పీఎస్‌ఎంఎస్‌పీ నూతన గ్రామ కమిటీలను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశానికి ఎంస్‌పీ మండల నాయకులు ముత్యాల మల్లేశం మాదిగ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మండల ఇన్‌చార్జి జిల్లా ధర్మయ్య మాదిగ పాల్గొని ఉద్యమ చరిత్ర, భవిష్యత్ కార్యాచరణపై వివరించారు.ఎంఆర్‌పీఎస్ గ్రామ అధ్యక్షుడిగా కందిక చంద్రమౌళి మాదిగ, ఉపాధ్యక్షుడిగా కందిక వెంకట నర్సి మాదిగ, కార్యదర్శిగా దుబ్బ రమేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా తాటికాయల సంతోష్ మాదిగ ఎన్నికయ్యారు. ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా జోగు అనిల్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా దుబ్బ సంపత్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కందిక ఉపస్వామి మాదిగను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చాడ కరుణాకర్ మాదిగ, కందిక బాబు, జోగు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# తల్లాడలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి




**తల్లాడ/ ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):**తల్లాడ పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి కోరారు. సోమవారం నిర్వహించిన తొలి ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

భద్రాచలం, కొత్తగూడెం, సత్తుపల్లి, రాజమండ్రి ప్రాంతాలకు తల్లాడ ప్రధాన కూడలిగా ఉందని తెలిపారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తే అందంగా మారడంతోపాటు రాత్రివేళ ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరగా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఎన్‌టీఆర్ నగర్ నుంచి బిల్లుపాడు వరకు రహదారి పనులు పూర్తిచేయాలని మరో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, దీవెల కృష్ణయ్య, మాజీ జడ్పీటీసీ మూకర ప్రసాద్, అన్నారుగూడెం మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.


# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కొనసాగించాలి



**కేసముద్రం, ఆగస్టు 17 (జర్నలిస్టు వార్త):**కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కేసముద్రంలో ధర్నా నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి నల్లబ్యాడ్జీలతో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఈ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని నాయకులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కోర్టు వ్యవహారంలో ప్రభుత్వం సరైన రీతిలో వాదనలు వినిపించకపోవడం వల్లే సమస్య తలెత్తిందని విమర్శించారు.పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పథకాలను నిరంతరాయంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు రావుల వినయ్‌రెడ్డి, పాయిరాల శరత్‌యాదవ్, బెరువాడ సర్పంచ్ ఈసం లక్ష్మీనారాయణ, నాయకులు పోలు వెంకన్న, కొమ్ము రాహుల్, మేకల సురేష్, బానోత్ దేవేందర్, లక్ష్మీనారాయణ, యాకమల్లు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసే కుట్ర.

## -మాజీ జెడ్పీ చైర్మన్ అంగోత్ బిందు.



**బయ్యారం,ఆగస్టు 17.(జర్నలిస్ట్ వార్త)**

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ,మండల పార్టీ అధ్యక్షులు తాత గణేష్ పిలుపు మేరకు మండల ఉపాధ్యక్షులు బానోత్ మురళికృష్ణ ఆధ్వర్యంలో కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలకు చట్ట బద్దత కల్పించి యధావిధిగా కొనసాగించాలని,అదేవిధంగా రైతు భీమా ప్రీమియం వెంటనే చెల్లించాలని సోమవారం బయ్యారం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించి వివిధ డిమాండ్లతో కూడిన మెమోరండం బిఆర్ఎస్ నేతలు తాహశీల్దార్ నాగరాజుకు అందించారు.ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జడ్పీ చైర్పన్ అంగోత్ బిందు, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ, సీనియర్ నాయకులు ఏనుగుల ఐలయ్య,మండల నాయకులు పార్టీ సర్పంచ్ లు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి..

## -తహసీల్దార్ నాగరాజు.

**బయ్యారం,ఆగస్టు 17,(జర్నలిస్ట్ వార్త)**ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని బయ్యారం తహసీల్దార్ నాగరాజు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో దీపిక,




తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ ప్రజావాణికి మొత్తం 11 దరఖాస్తులు అందాయని తెలిపారు.అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదులు అందజేశామని పేర్కొన్నారు.ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసి, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అన్నారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ముచ్చర్ల కమిటీ ఎన్నిక

## అధ్యక్షుడిగా బొక్క విజయ్ మాదిగ



**హసన్‌పర్తి/ ఆగస్టు 17 (జర్నలిస్ట్ వార్త):**

హసన్‌పర్తి మండలం ముచ్చర్ల గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి గంగారపు శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజారావు బిక్షపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు బొక్క సాంబరాజు మాదిగల ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు.నూతన అధ్యక్షుడిగా బొక్క విజయ్ మాదిగ, అధికార ప్రతినిధిగా మట్టేడ అజయ్ మాదిగ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మట్టేడ అజయ్ (గాంధీ) మాదిగ, రామంచ అర్జున్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా మట్టేడ వెంకటేష్ మాదిగ, కోశాధికారిగా జన్ను హరినందు మాదిగ బాధ్యతలు చేపట్టారు.కార్యదర్శులుగా బొక్క శ్రీకాంత్ మాదిగ, మట్టేడ రాకేష్ మాదిగ, సహాయ కార్యదర్శులుగా మట్టేడ అనిల్ మాదిగ, మట్టేడ సంపత్ మాదిగ, మట్టేడ మధుకర్ మాదిగలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్‌ను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికి సంఘం తరఫున నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు. నూతన కమిటీ ఎన్నిక పట్ల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

# అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



**తల్లాడ/ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):**తల్లాడ మండలంలో నివసిస్తున్న అర్హులైన పాస్టర్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని టీసీఎస్ఐ మండల అధ్యక్షుడు బ్రదర్ కె.వి. ఇశ్రాయేలు కోరారు. సోమవారం తల్లాడ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఈ మేరకు అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన పేద పాస్టర్లను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఇళ్లులేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ప్రాధాన్యమివ్వాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో టీసీఎస్ఐ జిల్లా నాయకుడు గుంటి బాబురావు, నారపోగు ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి కోసం ఎస్సై కాళ్లపై పడిన రైతు!

## ఎండిపోతున్న పంటలను కాపాడాలంటూ కన్నీటి వేడుకోలు

## చేతికొచ్చే దశలో నీరందక రైతుల ఆందోళన



**వైరా/ ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):**
సాగునీటి కోసం ఓ రైతు ఎస్సై కాళ్లపై పడి వేడుకున్న హృదయ విదారక ఘటన వైరా మండల పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. చేతికొచ్చే దశలో ఉన్న పంటలకు సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంటలు ఎండిపోతుండటంతో పెట్టిన పెట్టుబడి, చేసిన కష్టం మొత్తం వృథా అవుతుందేమోనని కన్నీరుమున్నీరవుతున్నారు.మండల పరిధిలోని పలు గ్రామాల్లో సాగు చేసిన పంటలకు ప్రస్తుతం నీటి అవసరం అత్యంత కీలకంగా మారింది. పొలాల్లో పంటలు ఎండిపోతున్న పరిస్థితులను చూసి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు అందించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆందోళన మరింత పెరిగింది.ఈ క్రమంలో బోడంపుడి మాధరావు అనే రైతు తన పంటలను కాపాడుకునేందుకు సాగునీరు ఇప్పించాలని కోరుతూ ఎస్సైని వేడుకున్నాడు. ఆవేదన తట్టుకోలేక ఎస్సై కాళ్లపై పడడంతో అక్కడి పరిస్థితి ఉద్విగ్నంగా మారింది. రైతు కన్నీటి వేడుకోలు అక్కడున్న వారిని కదిలించింది.పంట చేతికొచ్చే సమయంలో నీరందకపోతే మా పరిస్థితి ఏంటి?' అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీటి సమస్యను పరిష్కరించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

## కార్పొరేషన్ రుణాలతో ఆర్థికంగా ఆదుకోవాలి

## కలెక్టర్‌కు తెలంగాణ పేదల రాజ్యాధికార సమితి వినతి




**వరంగల్/ఆగస్టు 17 (జర్నలిస్ట్ వార్త):** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ, ఎఫ్‌సీ కులాలకు చెందిన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళు మంజూరు చేయాలని తెలంగాణ పేదల రాజ్యాధికార సమితి నాయకులు డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించి స్వయం ఉపాధికి ప్రభుత్వం చేయూతనివ్వాలని కోరారు.సంస్థ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, పేదల పెన్నిధి ప్రేమన్న ఆదేశాల మేరకు సమితి వైస్ ప్రెసిడెంట్ సామల భాస్కర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టే పుష్పరాజ్ సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులం, మతంతో సంబంధం లేకుండా ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని కోరారు.ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయడంతోపాటు, స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలను ఆదుకునేందుకు కార్పొరేషన్ రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# కొమ్ము అనుబంధ కుటుంబాల పరపతి సంఘం కమిటీ ఎన్నిక

## నూతన అధ్యక్షుడిగా కొమ్ము శ్రవణ్‌కుమార్ ఏకగ్రీవ ఎన్నిక

**కేసముద్రం/ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):**



చైతన్యనగర్‌లోని కొమ్ము వారి అనుబంధ కుటుంబాల పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కొమ్ము శ్రవణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పందుల సారయ్య ఎన్నికయ్యారు.ప్రచార కార్యదర్శిగా పెండెల రవికుమార్, కోశాధికారిగా కొమ్ము సంజీవ, సభ్యులుగా పందుల వేణుమాధవ్, కొమ్ము నిఖిల్, కడారి నాగయ్య, ప్రేమ్‌కుమార్, కొమ్ము రామకృష్ణ, కొమ్ము సునీల్ బాధ్యతలు స్వీకరించారు.కొమ్ము కుల పెద్దలు కొమ్ము సంజీవ, కొమ్ము వీరస్వామి, పందుల సంజీవ, ఇమ్మడి వీరభద్రం, జలగం వీరస్వామి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొమ్ము శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధితో పాటు అనుబంధ కుటుంబాల సంక్షేమానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు.సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కమిటీ ఎన్నికకు సహకరించిన సభ్యులు, ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా రవి నాయక్ ఏకగ్రీవ ఎన్నిక

**కేసముద్రం/ ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):**



మహబూబాబాద్ జిల్లా సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) అధ్యక్షుడిగా బిచ్యానాయక్‌తండా సర్పంచ్ వాంకుడోత్ రవి నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలోని సర్పంచుల సమస్యల పరిష్కారం, స్థానిక సంస్థల హక్కుల పరిరక్షణ కోసం ఆయన నాయకత్వంలో పోరాటం కొనసాగించాలని సర్పంచులు నిర్ణయించారు.బిచ్యానాయక్‌తండా సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి చేసిన కృషి, ప్రజా సమస్యలపై స్పందించిన తీరు, సర్పంచుల సమస్యలపై ఆయనకున్న అవగాహనను గుర్తించిన జిల్లాలోని సర్పంచులు రవి నాయక్‌ను జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా పలువురు సర్పంచులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల సమస్యలు, నిధుల కొరత, స్థానిక సంస్థల హక్కుల పరిరక్షణ వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రవి నాయక్ సమర్థంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలోని సర్పంచులందరినీ సమన్వయం చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.రవి నాయక్ ఎన్నికపై బిచ్యానాయక్‌తండా గ్రామస్థులు, తోటి సర్పంచులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలిపారు.

# గిన్నిస్ రికార్డులో వరంగల్ కరాటే మాస్టర్లు

## చెన్నైలో ఆల్‌టైమ్ రికార్డ్స్‌లో సత్తాచాటిన దామోదర శంకర్, దేవయ్య




**హసన్‌పర్తి/ఆగస్టు 17 (జర్నలిస్ట్ వార్త):**
వరంగల్-హనుమకొండ జిల్లాలకు చెందిన కరాటే మాస్టర్లు అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటారు. గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. చెన్నైలో ఈ నెల 16న వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ (డబ్ల్యూకేఎంఏ) ఆధ్వర్యంలో ఎస్.బాలమురుగన్ నిర్వహించిన ఆల్‌టైమ్ రికార్డ్స్ కార్యక్రమంలో కరాటే బుడోకాన్ ఇంటర్నేషనల్ వరల్డ్‌కు చెందిన బ్లాక్ బెల్ట్ మాస్టర్లు దామోదర శంకర్, దేవయ్య పాల్గొన్నారు.
రికార్డు సాధనలో తమ ప్రతిభను ప్రదర్శించిన వీరు విజయాన్ని సొంతం చేసుకున్నారు. దీంతో వరంగల్-హనుమకొండ జిల్లాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా కరాటే మాస్టర్లకు పలువురు అభినందనలు తెలిపారు. మాస్టర్లకు అభినందనలుగిన్నిస్ రికార్డులో స్థానం సాధించిన దామోదర శంకర్, దేవయ్యలను తెలంగాణ రాష్ట్ర బుడోకాన్ కరాటే ఇంటర్నేషనల్ వరల్డ్ అధ్యక్షుడు బి.చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్, పాండ దినేష్, ఎం.రవి, దుర్గాప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు. కరాటే రంగంలో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# నకిలీ పర్మిట్లతో కలప దందా!

## అటవీ అనుమతి పత్రాల ట్యాంపరింగ్.. ఇద్దరి అరెస్ట్

## 9 లారీల కలప ఇతర రాష్ట్రాలకు తరలింపు -సీసీఎస్ ఏసీపీ మహ్మద్ సర్వర్



**ఖమ్మం/ ఆగస్టు 17 (జర్నలిస్ట్ వార్త):**
అటవీ శాఖ అనుమతి పత్రాలనే ట్యాంపరింగ్ చేసి కలప అక్రమ రవాణాకు పాల్పడిన ఇద్దరిని సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీసీఎస్ ఏసీపీ మహ్మద్ సర్వర్ తెలిపారు. కలప అక్రమ రవాణా వెనుక మరికొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న పోలీసులు ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు.
గతేడాది డిసెంబర్‌లో ఖమ్మం ఫారెస్ట్ రేంజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశాలతో ఏసీపీ మహ్మద్ సర్వర్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్ దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో కీలక ఆధారాలు సేకరించిన పోలీసులు ఆదివారం ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

### పర్మిట్ ట్యాంపరింగ్

పోలీసుల కథనం ప్రకారం.. నల్లతుమ్మ కలప తరలింపునకు అటవీ శాఖ జారీ చేసిన అనుమతి పత్రాలను నిందితులు ట్యాంపరింగ్ చేశారు. ఇతర వ్యక్తుల పేర్లతో ఉన్న పర్మిట్లలో కలప రకాన్ని మార్చి 'సంద్ర కలప'గా చూపిస్తూ నకిలీ పత్రాలను తయారు చేశారు. అనంతరం అయ్యగారుపల్లి, కురవి, సీరోలు, కంపెల్లి, మహబూబాబాద్ ప్రాంతాల్లో సంద్ర చెట్లను నరికించి, నకిలీ పర్మిట్లతో విజయవాడకు చెందిన రాధేశ్యామ్‌కు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో సూర్యాపేట జిల్లా మోతె మండలం గోప్యతండాకు చెందిన కలప వ్యాపారి కొర్ర శివ, విజయవాడకు చెందిన రాధేశ్యామ్‌ను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు.

### కత్తా తయారీకి తరలింపు

రాధేశ్యామ్ ఈ కలపను మధ్యప్రదేశ్‌లోని జాబువా పట్టణంలోని ఏఎం ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన అబ్దుల్ రహమాన్‌కు సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది. పాన్‌మసాలాలో వినియోగించే కత్తా తయారీలో ఈ కలపను ఉపయోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు సుమారు తొమ్మిది లారీల కలపను ఇతర రాష్ట్రాలకు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

### మరో కేసుల చిట్టా

నిందితుడు కొర్ర శివపై వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోనూ అటవీ కేసులు నమోదైనట్లు దర్యాప్తులో తేలిందని ఏసీపీ సర్వర్ తెలిపారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, అక్రమ కలప రవాణాతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి పాత్రను వెలుగులోకి తెచ్చి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### సిబ్బందికి అభినందనలు

కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఏసీపీ మహ్మద్ సర్వర్, ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్ఐ ఎ.వంశీకృష్ణ, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, హరి, జానీ, నరసింహారావు, సుధీర్, సతీష్, సుందర్, శ్రీధర్‌లను పోలీస్ కమిషనర్ అభినందించారు.

# సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## రూ.2.40 కోట్ల అభివృద్ధి పనులకు కడియం శ్రీహరి శంకుస్థాపన

## రాంపూర్‌లో మరో 50 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తా: ఎమ్మెల్యే







**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 17 (జర్నలిస్టు వార్త):**
ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. పని చేసే ప్రభుత్వానికి, ప్రజల కోసం నిరంతరం శ్రమించే ప్రజాప్రతినిధికి ప్రజల సహకారం, మద్దతు ఉండాలని కోరారు.గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ పరిధిలోని స్టేషన్ పెండ్యాలలో రూ.50 లక్షలతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. అనంతరం రాంపూర్‌లో రూ.1.50 కోట్లతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, రూ.40 లక్షలతో స్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

### నాలుగు నెలల్లో రూ.6.40 కోట్ల పనులు

రాంపూర్‌లో కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రూ.6.40 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు కడియం శ్రీహరి తెలిపారు. ఒక్కరోజే రూ.2.40 కోట్ల పనులకు శంకుస్థాపన చేశామని, మూడు నెలల్లో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఉన్నాయని, మరో రూ.కోటి విలువైన సీసీ రోడ్ల పనులకు 15 రోజుల్లో నిధులు మంజూరు చేస్తామని చెప్పారు.

### మరో 50 ఇళ్లకు హామీ

రాంపూర్‌కు తొలి విడతలో 30 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, రెండో విడతలో మరో 50 ఇళ్లు మంజూరు చేస్తామని కడియం శ్రీహరి ప్రకటించారు. గుడిసెలు, పెంకుటిళ్లు, రేకుల ఇళ్లలో నివసిస్తున్న అర్హులకు తప్పకుండా ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం, గత ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకోవడం తప్ప రాంపూర్‌కు ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు.

### బీఆర్ఎస్‌పై విమర్శలు

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తోందని కడియం శ్రీహరి విమర్శించారు. రాష్ట్రంలో తొలి విడతగా 4.50 లక్షలు, రెండో విడతగా 2.50 లక్షలు.. మొత్తం రూ.35 వేల కోట్లతో 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.
గత ప్రభుత్వం చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పింఛన్లు, రైతుభరోసా వంటి పథకాలు అమలవుతున్నాయని వివరించారు.
తన 35 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ అవినీతికి పాల్పడలేదని కడియం శ్రీహరి అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటిస్తున్నానని, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. గతంలో గ్రామం ఎలా ఉండేది.. ఇప్పుడు ఎలా ఉందో ప్రజలే గమనించాలని కోరారు.
కార్యక్రమంలో కార్పొరేటర్ మునిగాల సరోజన, డివిజన్ అధ్యక్షుడు బిక్షపతి, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా






**'శక్తి' పాలసీని వెనక్కి తీసుకోవాలి**

**హాస్టళ్లు, ల్యాబ్‌లు, భవనాలకు నిధులు ఇవ్వాలి**

**ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్**

**హసన్‌పర్తి/ఆగస్టు 17 (జర్నలిస్ట్ వార్త):** పాలిటెక్నిక్ కళాశాలల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పరకాల పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. శక్తి' పాలసీని వెనక్కి తీసుకోవాలని, ఎస్‌బీటీఈటీ బోర్డును బలోపేతం చేసి అభివృద్ధి చేయాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో హాస్టళ్లు, ల్యాబ్‌లు, భవనాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు. విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు.

పాలిటెక్నిక్ అధ్యాపకులు, సిబ్బంది సర్వీస్ నిబంధనలకు రక్షణ కల్పించాలని కళ్యాణ్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను వైఐఎస్‌యూలో విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. విద్యార్థులు, అధ్యాపకుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే స్పష్టత ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రానున్న రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బొచ్చు ఈశ్వర్, పరకాల పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్, నాయకులు ప్రశాంత్, నాగరాజ్, అభినవ్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో ప్రసంగి విద్యార్థుల ప్రతిభ

**జమ్మికుంట/ ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):** కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో జమ్మికుంట ప్రసంగి డాన్స్ స్టూడియో విద్యార్థులు ప్రతిభ చాటారు. స్టార్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం కళాభారతిలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం, సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్-2026 సందర్భంగా పోటీలు నిర్వహించారు.సీనియర్ వెస్టర్న్ సోలోలో అల్ల అశ్విత, సీనియర్ ఫోక్ సోలోలో వి.భావన ప్రథమ బహుమతులు సాధించారు. జూనియర్ వెస్టర్న్ సోలోలో పి.ప్రకృతి, జూనియర్ ఫోక్ సోలోలో కె.రసగ్న ద్వితీయ బహుమతులు అందుకున్నారు.




జూనియర్ ఫోక్ డ్యూయెట్‌లో కె.రసగ్న, పి.ప్రకృతి ద్వితీయ బహుమతి సాధించారు.వివిధ ప్రాంతాల నుంచి నృత్య కళాకారులు పాల్గొన్న పోటీల్లో వెస్టర్న్, ఫోక్, క్లాసికల్, ఇతర విభాగాల్లో సోలో, డ్యూయెట్, గ్రూప్ కేటగిరీల్లో పోటీలు జరిగాయి.ప్రసంగి డాన్స్ స్టూడియో డైరెక్టర్ శ్రీలత మాట్లాడుతూ తమ విద్యార్థులు ఇప్పటివరకు 15 రాష్ట్రస్థాయి, రెండు జాతీయస్థాయి పోటీల్లో విజయాలు సాధించారని తెలిపారు. విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న డాన్స్ మాస్టర్లు, ప్రసంగి కె.రాజేష్, తల్లిదండ్రులను అభినందించారు. మరిన్ని పోటీల్లో పాల్గొని జమ్మికుంటకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజేతలను మాస్టర్లు, తల్లిదండ్రులు అభినందించారు.

## సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలి

**జమ్మికుంట/ ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):** సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సచివాలయం ఎదుట సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరాస్వామి గౌడ్ కోరారు. హైదరాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నగరం నడిబొడ్డున హుస్సేన్‌సాగర్ తీరంలో



సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని 25 ఏళ్లుగా వివిధ రూపాల్లో పోరాటాలు చేశామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు.సభలో గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు ప్రకటించాలని కోరారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని, జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, 50 ఏళ్లు నిండిన గీత కార్మికులకు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెట్టుపై నుంచి పడి గాయపడిన కార్మికులకు సదరం ధ్రువపత్రాల ప్రక్రియను సులభతరం చేసి పరిహారం పెంచాలని కోరారు.ప్రమాదాల్లో మృతిచెందిన గీత కార్మికుల కుటుంబాలకు పరిహారం పెంచాలని, గతంలో అందించిన తక్షణ సాయాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. సభకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరుకానున్నారని తెలిపారు.గౌడ సంఘాల ప్రతినిధులు, గీత కార్మికులు, సర్వాయి పాపన్న అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని వీరాస్వామి గౌడ్ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్సం సోమన్న గౌడ్, ఉపాధ్యక్షుడు పొన్నం బిక్షపతి గౌడ్, కోశాధికారి రెగటి నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలను కాపాడాలి



**కేసముద్రం/ ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కమిటీ కోరింది. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారికి వినతిపత్రం అందజేశారు.సీపీఎం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను గతంలో రెవెన్యూ అధికారులు గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని క్రీడా మైదానాలు, మినీ పార్కులు, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు వినియోగించాలని కోరారు.జ్యోతిబాపూలే సెంటర్‌లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని, ప్రధాన కూడళ్లలో ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. రహదారి విస్తరణలో దుకాణాలు కోల్పోయిన చిరు వ్యాపారులు, చేతివృత్తిదారులకు షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి పునరావాసం కల్పించాలని కోరారు.మున్సిపాలిటీలో తొలిసారిగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెంకన్న తెలిపారు.ం

## కేసముద్రంలో ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

**కేసముద్రం/ ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ముత్యాలమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో మహిళలు బోనాలతో ఆలయాలకు తరలివచ్చారు. డప్పుల దరువులు, పోతురాజుల విన్యాసాలతో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఆగస్టు 5న కేసముద్రం విలేజ్‌లో, 16న కేసముద్రం స్టేషన్, అమీనాపురం, ధన్నసరి ప్రాంతాల్లో మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.కళాకారుల



నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఉత్సవాలు విజయవంతం కావడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, కుల సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు సహకరించారని మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీతవెంకన్న తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అల్లం రమనాగేశ్వరరావు, కౌన్సిలర్లు జాటోత్ సుజాతహరినాయక్, ధరావత్ కిషోర్, దూడపాక కృష్ణ, పూరం రాజమణి, పాయిరాల శరత్‌యాదవ్, రావుల వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ధర్మసాగర్ మండల కేంద్రంలో ప్రజావాణి

**ప్రజావాణికి 13 వినతులు**

**సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం**

**: ఎంపీడీవో అనిల్‌కుమార్, తహసీల్దార్ బావుసింగ్**

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోఆగస్టు 17 (జర్నలిస్ వార్త):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఎంపీడీవో అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ బావుసింగ్‌తో పాటు మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు.

**వివిధ శాఖలకు 13 దరఖాస్తులు**

ప్రజావాణిలో మొత్తం 13 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 5, ఎంపీఓకు 4, ఎంపీడీవో కార్యాలయానికి




1, వైద్యశాఖకు 2, గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 1 దరఖాస్తు వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులకు అందించి, నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

**సమస్యల పరిష్కారమే లక్ష్యం**

ఈ సందర్భంగా ఎంపీడీవో అనిల్‌కుమార్, తహసీల్దార్ బావుసింగ్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు ఒకే వేదికపై అందుబాటులో ఉండటంతో ప్రజలు తమ సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతుల విషయంలో నిర్లక్ష్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు స్పందించాలని పేర్కొన్నారు.మండలంలోని ప్రజలు తమకు ఎదురయ్యే సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఎంపీడీవో, తహసీల్దార్ కోరారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో మండలంలోని రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య, గృహ నిర్మాణ తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

**మండలంలో తొలిసారి ప్రజావాణి.. 15 వినతులు స్వీకరణ**

**కేసముద్రం/ ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో టి.హరీష్ కోరారు. కేసముద్రం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని రైతువేదికలో సోమవారం తొలిసారిగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో టి.హరీష్, తహసీల్దార్ జి.వివేక్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

**15 దరఖాస్తుల స్వీకరణ**

ప్రజావాణికి మండలంలోని వివిధ శాఖలకు చెందిన 21 మంది అధికారులు హాజరయ్యారని హరీష్ తెలిపారు. ప్రజల నుంచి మొత్తం 15 వినతులు అందాయని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదులు అందజేసినట్లు చెప్పారు. వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రజావాణిలో అందిన వినతులను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు





పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. అధికారులు తమ శాఖల పరిధిలోని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

**సమస్యల పరిష్కారానికి వేదిక**

ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి మంచి వేదికగా నిలుస్తుందని హరీష్ పేర్కొన్నారు. మండలస్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.శ్రీనివాస్‌రావు, ఏడీఈ ఎం.రాములునాయక్, ఏపీఎం టి.కృష్ణమూర్తి, ఎఫ్ఆర్వో టి.గంగాధర్, ఎంఈవో కె.యాదగిరి, మండల వైద్యాధికారి డాక్టర్ టి.నంబికిషోర్, పశువైద్యాధికారి డాక్టర్ బి.విజయ్‌కుమార్, అదనపు సీడీపీవో కె.కోమలాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాలలను అనుసంధానం చేయొద్దు

**కేసముద్రం/ ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అనుసంధానం చేయొద్దని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు వెలుగు శ్రావణ్, పట్ల మధు డిమాండ్ చేశారు. జీవో 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని, లాటరల్ ఎంట్రీ విధానాన్ని కొనసాగించాలని కోరారు.

జీవో 97కు వ్యతిరేకంగా సోమవారం కేసముద్రంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి బ్రహ్మంగారి గుడి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం మానవహారం చేపట్టారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీ పేరుతో ప్రభుత్వ సాంకేతిక విద్యను ప్రైవేటీకరించే ప్రయత్నం చేయొద్దన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధి నుంచి తొలగించొద్దని కోరారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్య అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలకు అవసరమైన నిధులు, అధ్యాపకులు, ప్రయోగశాలలు, వర్క్‌షాప్‌లు, వసతిగృహాలు కల్పించాలని డిమాండ్ చేశారు.పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులు లాటరల్ ఎంట్రీ ద్వారా ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో చేరే అవకాశం




ఉందని తెలిపారు. ఆ విధానాన్ని రద్దు చేస్తే విద్యార్థులకు అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు.జీవో 97ను ఉపసంహరించుకుని పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేయాలని, లాటరల్ ఎంట్రీని కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు చొప్పరి శరత్, మేక వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాకేష్, అఖిల్, ప్రణదీప్, మహంకాళి చరణ్, సాగర్, రోహిత్, అశ్వంత్, ప్రవళిక, హర్షిత, సాక్షిక, నవ్య తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి నిధులతో ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటులో అవకతవకలా?

**సత్తుపల్లి/ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):**
సింగరేణి ప్రభావిత గ్రామాల్లో సీఎస్ఆర్, ఎస్ఏఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్లలో అవకతవకలు జరిగాయనే అనుమానాలు ఉన్నాయని బీజేపీ సత్తుపల్లి మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ అన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు ఆదేశాలు, రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు సూచనల మేరకు సోమవారం సింగరేణి ప్రభావిత గ్రామాల్లోని ఆర్ఓ ప్లాంట్లను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటుకు ఎంత నిధులు మంజూరు చేశారు? ఏ సంస్థకు పనులు అప్పగించారు? ఎంత ఖర్చు చేశారు? ప్రస్తుతం ఎన్ని ప్లాంట్లు పనిచేస్తున్నాయి? నిర్వహణకు ఎంత ఖర్చవుతోంది? అనే వివరాలను సింగరేణి యాజమాన్యం వెల్లడించాలని కోరారు. ప్రజల తాగునీటి కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగమై ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. మంజూరు ఉత్తర్వులు, అంచనా వ్యయాలు, టెండర్లు, బిల్లులు, కాంట్రాక్టర్ వివరాలు, నిర్వహణ ఖర్చులపై పూర్తి సమాచారం సేకరిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర, జిల్లా నాయకుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన ఆధారాలతో ఉద్యమం చేపడతామని శివకృష్ణ హెచ్చరించారు. సింగరేణి నిధులు ప్రజల కోసం కేటాయించినవని, ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు.

# ఎకరం పంట కూడా ఎండిపోకూడదు

## నీటిపారుదల అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు

**ఖమ్మం/ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):**
సాగర్ ఆయకట్టు పరిధిలో రైతులు సాగు చేసిన పంటల్లో ఎకరం కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. పంటలకు సకాలంలో నీరు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.
సాగర్ ఆయకట్టు పరిధిలో నెలకొన్న నీటి సమస్యను మంత్రి తుమ్మల గతవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్‌లను ప్రారంభించి నీటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా ఆగస్టు 15న అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో మంత్రి తుమ్మల మోటార్లను ప్రారంభించి గోదావరి జలాలను రాజీవ్ లింక్ కెనాల్‌కు విడుదల చేశారు.
రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టు పరిధిలోని ప్రధాన చెరువులకు ఇప్పటికే నీరు చేరుతోందని మంత్రి తెలిపారు. రైతులు సాగు చేసిన పంటలకు సకాలంలో, సక్రమంగా నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.



నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ఎక్కడైనా చిన్న సమస్య తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.
సీఎం, మంత్రికి కృతజ్ఞతలు
సాగర్ ఆయకట్టుకు సకాలంలో నీరు అందేలా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఖమ్మం జిల్లా ప్రజలు, రైతుల తరఫున మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాల ప్రవాహం, ప్రధాన జలాశయాల్లో నీటిమట్టం తదితర వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంటలకు నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

# వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు

## గ్రామదేవతలకు జలాభిషేకాలు.. ఆలయాల్లో విశేష పూజలు -సర్వమత సమైక్యతకు ప్రతీకగా వేడుకలు



**తల్లాడ/ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):**
సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ తల్లాడ మండల ప్రజలు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గ్రామదేవతలకు భక్తులు జలాభిషేకాలు చేసి, మకర తోరణాలు సమర్పించారు. స్థానిక శివాలయం, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, విశేష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామాలు సుభిక్షంగా ఉండాలని, ప్రకృతి వైపరీత్యాలు తొలగిపోయి రైతులకు మంచి పంటలు పండాలని భక్తులు ప్రార్థించారు. పూజా కార్యక్రమాల్లో కులమతాలకు అతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
మహిళలు, గ్రామ పెద్దలతో పాటు ముస్లిం సోదరులు, ఇతర మతాలకు చెందిన వారు కూడా పూజల్లో పాల్గొన్నారు. గ్రామాల క్షేమం కోసం అందరూ కలిసికట్టుగా ప్రార్థనలు చేయడంతో తల్లాడలో సర్వమత సమైక్యత, సోదరభావం వెల్లివిరిసింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



# సీబీఎస్ఈ ఖో-ఖోలో ఏకశిల హవా







**ఐనవోలు/ఆగస్టు 17(జర్నలిస్ట్ వార్త):**
ఏపీ, తెలంగాణ సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖో-ఖో పోటీల్లో పున్నేలుకు చెందిన ఏకశిల హైస్కూల్ బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఈ నెల 8 నుంచి 10 వరకు జరిగిన పోటీల్లో 84 జట్లు పాల్గొనగా. ఏకశిల బాలురు విజేతగా నిలిచారు. ఇప్పటికే బాలికల జట్టు కూడా ప్రథమ స్థానం సాధించింది.
విజేతలను ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ తిరుపతిరెడ్డి అభినందించారు. బాలురు, బాలికల రెండు జట్లకు చెందిన 24 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. తమిళనాడులో ఈ నెల 29 నుంచి అక్టోబరు 4 వరకు జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.డి. బాబా, వైస్ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, కోచ్ రజినీకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జూలూరులో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

**పోచంపల్లి /ఆగస్టు 17 (జర్నలిస్ట్ వార్త):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి నియోజకవర్గంలోని పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు మూటపురం రాము మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి మహేందర్ మాదిగ హాజరయ్యారు.
ఈ సందర్భంగా మహేందర్ మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మంగళవారం పోచంపల్లిలో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ నూతన మండల కమిటీల ఎన్నికను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.
అనంతరం జూలూరు గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా సిరుపాంగి గంగయ్య




మాదిగ, అధికార ప్రతినిధిగా యాఖరి మహేష్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా బొచ్చు మహేష్ మాదిగ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సందేన భరత్ మాదిగ, మూటపురం భాను ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పోచంపల్లి, బీబీనగర్ మండలాల ఇన్‌చార్జి ఇటుకల దేవేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు యాఖరి నరసింగరావు మాదిగ, మాజీ మండల అధ్యక్షుడు బసవయ్య మాదిగ, గ్రామ ఉపసర్పంచ్ నరసింహులు మాదిగ, మాజీ ఉపసర్పంచ్ దయాకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు. గ్రామం నుంచి మండల, జిల్లా స్థాయి బాధ్యతలకు పరమేష్ మాదిగ, మూటపురం రాము మాదిగలను ఎంపిక చేశారు.

# శిథిలావస్థలో ప్రభుత్వ జూనియర్ కళాశాల

**సత్తుపల్లి/ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):**
సత్తుపల్లిలోని బండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరింది. 1970లో నిర్మించిన భవనం పెచ్చులు ఊడిపోతూ, గోడలకు పగుళ్లు ఏర్పడటంతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలకు శాశ్వత భవనం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరై రెండేళ్లు గడిచినా పనులు ప్రారంభం కాలేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. తాత్కాలిక మరమ్మతుల కోసం మంజూరైన రూ.7 లక్షలు కూడా విడుదల కాలేదన్నారు. భవనం పరిస్థితి కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు కళాశాలలో చేరేందుకు వెనుకాడుతున్నారని తెలిపారు.



కళాశాల పరిస్థితిని సత్తుపల్లి బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాణోత్ విజయ్, ప్రధాన కార్యదర్శి మందా శివయాదవ్ ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఖమ్మం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు భాస్కర్ల వీరంరాజు పాల్గొన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్ల వీరంరాజు మాట్లాడుతూ విద్యార్థుల భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. రూ.2 కోట్లు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించకపోవడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్యను బీజేపీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. శాశ్వత భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, పెండింగ్ నిధులు విడుదల చేయాలని బీజేపీ నాయకులు కోరారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్, డాక్టర్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు పనుల్లో నాణ్యత లోపాలపై చర్యలు తీసుకోవాలి

**జూలూరుపాడు/ఆగస్టు 17 (జర్నలిస్ వార్త):**
సీతారామ ప్రాజెక్టు పనుల్లో నాణ్యతా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఖమ్మం జిల్లా గిరిజన సంఘం నాయకుడు జి. ప్రవీణ్ డిమాండ్ చేశారు. జూలూరుపాడు మండల పరిధిలో చేపడుతున్న పనుల్లో పలుచోట్ల పగుళ్లు ఏర్పడటం, నిర్మాణాలు దెబ్బతినడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో చేపట్టిన సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తికాకముందే దెబ్బతినడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జూలూరుపాడు నుంచి ఖమ్మం జిల్లా వైపు నిర్మిస్తున్న లింక్ కెనాల్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపించారు.



ప్రాజెక్టు పనులపై అధికారుల పర్యవేక్షణ లోపం కూడా స్పష్టమవుతోందని విమర్శించారు. వెంటనే ఉన్నతస్థాయి విచారణ జరిపి, సాంకేతిక నిపుణులతో పనుల నాణ్యతను పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరారు. నాణ్యత లోపాలకు బాధ్యులైన కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు రైతుల ప్రయోజనాల కోసం నిర్మిస్తున్నదని, ఇందులో అవినీతి, నిర్లక్ష్యం, నాణ్యతా లోపాలను సహించేది లేదని ప్రవీణ్ స్పష్టం చేశారు. దెబ్బతిన్న పనులను నాణ్యతా ప్రమాణాలతో పునరుద్ధరించి, రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు

# నిఖిల్ రామ్‌సాయి ప్రసన్న నిశ్చితార్థ వేడుక

**వరంగల్/ఆగస్టు 17 (జర్నలిస్ట్ వార్త):**
నాంపల్లి మల్లేశం కుమారుడు నిఖిల్ రామ్, సాయి ప్రసన్న నిశ్చితార్థ వేడుక వరంగల్ హంటర్ రోడ్డులోని వీఎస్ఆర్ గార్డెన్‌లో ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హాజరై నిఖిల్ రామ్, సాయి ప్రసన్నలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నందనం సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, వర్ధన్నపేట మాజీ మార్కెట్ చైర్మన్ స్వామి రాయుడు, ఐనవోలు మండలం మాజీ సర్పంచ్ కుమారస్వామి, జర్నలిస్ట్ వెంకట రమణ, బిర్రు కరుణాకర్, మురళి, రమేష్, భాస్కర్, రఘు మాధవ్, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు అతిథులకు ఆత్మీయ స్వాగతం పలికారు.

